మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :271 ఎడిటర్: గొడిశాల సోమయ్య శనివారం 01-03-2025 పేజీలు :4 వెల : 2రూ



విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066




## వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

ప్రాంతీయ అనుసంధానాన్ని మెరుగు పరచడంతో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషితో వరంగల్‌లో విమానాశ్రయం పునరుద్ధరణకు సిద్ధమైంది. ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకే మైలురాయిగా నిలువనుంది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి పచ్చజెండా ఊపారు. ఈ దశలో జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ద్వారా నిర్వహించనున్నారు.ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న వరంగల్ ఎయిర్ పోర్టుకు లైన్ క్లియర్ చేసింది. ఈ ఆమోదం రాష్ట్రానికి కీలకమైన మైలురాయిని సూచిస్తుంది. ఆర్థిక వృద్ధిని పెంచి, మౌలిక సదుపాయాలను వేగవంతం చేయడంలో ఎన్డీఏ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు. వరంగల్‌కు ప్రధాన ప్రాంతీయ కేంద్రంగా మారేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని.. వాణిజ్యం, పర్యాటకం, స్థానిక ఉపాధికి కొత్త అవకాశాలను తీసుకురావడానికి, వేగవంతంగా పనులు చేపట్టేందుకు నిర్ధారించడానికి కట్టుబడి ఉన్నామని తెలియజేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2024 నవంబర్ 5న పౌర విమానయాన శాఖ మంత్రికి రాసిన


2లో

## బెదిరిస్తే బెదరడానికి ఎవరూ లేరు

హైదరాబాద్, ఫిబ్రవరి 28: తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి బెదిరిస్తే బెదరడానికి ఇక్కడ ఎవరు లేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి సైందవ పాత్ర పోషిస్తున్నారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరు చీకటి మిత్రులు అని అభివర్ణించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోన్న ప్రాజెక్ట్‌లకు అనుమతులు ఇస్తేనే తెలంగాణకు రావాలని కిషన్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. కేంద్రం ప్రత్యేకంగా తెలంగాణకు ఇచ్చింది ఏమీ లేదన్నారు. ఇన్ని సార్లు ముఖ్యమంత్రి వచ్చి అడుగుతోన్నా.. మీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు మాత్రం తమను ఎందుకు అడగడం లేదని మోదీ కేబినెట్‌లోని మంత్రులు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ నిర్మాణం ద్వారా బలమైన పునాదులు వేస్తామన్నారు. పేద వారికి కాంగ్రెస్ పార్టీ అందుబాటులో ఉండేలా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించామని చెప్పారు. కార్యకర్త మనసు ఎరిగిన నాయకురాలు మీనాక్షీ నటరాజన్ అని ఆయన తెలిపారు.



## 'ప్రపంచంలోనే అత్యుత్తమ భాష సంస్కృతం'..



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం (ఫిబ్రవరి 28) ఢిల్లీలోని సుందర్ నర్సరీలో జరిగిన గ్రాండ్ సూఫీ సంగీత ఉత్సవం జహాన్-ఎ-ఖుస్రావు-2025కు హాజరయ్యారు. ఈ సందర్భంగా, జహాన్-ఎ-ఖుస్రో కార్యక్రమంలో భిన్నమైన సువాసన ఉందని, ఈ సువాసన భారతదేశ నేల నుండి వస్తుందని ప్రధాని మోదీ అన్నారు. "హజ్రత్ అమీర్ ఖుస్రో స్వర్గంతో పోల్చిన హిందూస్తాన్. మన హిందూస్తాన్ స్వర్గపు తోట, ఇక్కడ ప్రతి రంగు సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఇక్కడి నేల స్వభావంలో ఏదో ప్రత్యేకత ఉంది. బహుశా అందుకే సూఫీ సంప్రదాయం హిందూస్తాన్‌కు వచ్చినప్పుడు, అది దాని స్వంత భూమితో అడుగుపెట్టినట్లు అనిపించింది" అని ప్రధాని మోదీ అన్నారు."పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానుంది, మీ అందరికీ, దేశవాసులందరికీ రంజాన్ శుభాకాంక్షలు. ఇటువంటి సందర్భాలు దేశ కళ, సంస్కృతికి ముఖ్యమైనవి. అవి ఓదార్పునిస్తాయి. ఈ జహాన్-ఎ-ఖుస్రో సిరీస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటోంది. ఈ 25 సంవత్సరాలలో, ఈ కార్యక్రమం ప్రజల మనస్సులలో చోటు సంపాదించుకోవడం ఒక గొప్ప

2లో

## హైదరాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదం..



హైదరాబాద్‌లోని పుప్పాలగూడలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.. మణికొండలోని పాషాకాలనీలో ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.. దీంతో మంటల్లో చిక్కుకుని ముగ్గురు సజీవదహనమయ్యారు.. చనిపోయిన వారిలో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు.. పాషాకాలనీలో ఉన్న %+%o2 ఇంట్లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి.. ఆ మంటలు వేగంగా ఫస్ట్‌ఫ్లోర్‌కి వ్యాపించాయి.. దట్టమైన పొగ.. మంటలతో.. ఇంట్లోనే బాధితులు చిక్కుకున్నారు.. ఊపిరాడక ముగ్గురు కూడా అక్కడే కుప్పకూలారు.. రెస్క్యూ చేసి కాపాడేలోపే ముగ్గురూ మృతి చెందినట్లు కాలనీ వాసులు తెలిపారు.సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం వెంటనే అక్కడికి చేరుకుంది.. సిబ్బంది మంటలను అదుపు చేయడంతోపాటు.. ఇంట్లో చిక్కుకున్న పలువురిని స్థానికుల సహాయంతో కాపాడారు. భవనం పైనుంచి తాళ్ల సహాయంతో పలువురిని రెస్క్యూ చేశారు.. అయితే.. భవనంలో షార్ట్ సర్క్యూట్ తోనే మంటలు చెలరేగాయా..? లేక మరేదైనా కారణం ఉందా..? అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## నా బ్యాగులు మోయవద్దు.. స్టేషన్‌కు రావొద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో ఎంతో పోరాట శక్తి ఉందని.. గతంలో అనేక రకాలుగా పోరాటాలు చేశామని.. అందుకే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో గాంధీభవన్‌లోని టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మీనాక్షి నటరాజన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. మనం ప్రభుత్వంలో ఉన్నాం.. పేదవాడి కోసం పని చేయాలి.. తద్వారా పేదల ముఖంలో నవ్వులు చూడాలని.. అలా అయితేనే మనం పని చేసినట్లు అవుతోందని తెలిపారులోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. రాజ్యాంగ రక్షణ కోసం భారత్ జోడో యాత్ర నిర్వహించారన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలతో మనం పోరాటం చేయవలసి ఉందన్నారు. దేశం కోసం పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీ.. స్వాతంత్రాన్ని తెచ్చిందని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ



ఎలాంటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉందని మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు.రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ఇవన్నీ ప్రజలకు సక్రమంగా

2లో

## మార్చి 15 కల్లా బీజేపీకి కొత్త అధ్యక్షుడు..రేసులో ఎవరంటే?

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వారసుని ఎన్నికపై కసరత్తు జరుగుతోంది. నూతన సారథి పేరును మార్చి 15వ తేదీలోగా పార్టీ అధిష్ఠానం ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. పార్టీ సంస్థాగత ఎన్నికలు 12 రాష్ట్రాల్లో పూర్తికాగా, మరో 6 రాష్ట్రాల్లో పార్టీ విభాగం చీఫ్‌లను ఎన్నుకోవాల్సి ఉంది. బీజేపీ రాజ్యాంగం ప్రకారం జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభించడానికి ముందు సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. ఆ ప్రకారం జాతీయ అధ్యక్షుడి ఎన్నిక కోసం మరో 6 రాష్ట్రాల్లో యూనిట్ చీఫ్‌లను ఎన్నుకునేందుకు కసరత్తు జరుగుతోందని చెబుతున్నారు. ఇందులో భాగంగా వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్న తమిళనాడు, పశ్చిమబెంగాల్, అసోం, గుజరాత్ రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రణాళికలను

2లో



## వరంగల్ వాసులకు గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్ర సర్కార్.. రూ.205 కోట్లు కేటాయింపు..!

లేఖలో.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఉడాన్ పథకం కింద విమానాశ్రయ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర మద్దతును పునరుద్ఘాటించారు. రాష్ట్రం ఇప్పటికే భూసేకరణ ప్రారంభించడంతో పాటు.. 280.30 ఎకరాల స్థలానికి గాను రూ.205 కోట్లు కేటాయించింది. విమానాశ్రయం పూర్తయితే.. ఈ విమానాశ్రయం ఎయిర్‌బస్ 320, బోయింగ్ 737 కేటగిరీ విమానాలను నిర్వహించగలదని భరోసా ఇచ్చింది. పనులు వేగవంతంపై..వరంగల్ విమానాశ్రయం పనులు వేగవంతంపై రాష్ట్ర అభ్యర్థనకు ప్రతిస్పందిస్తూ.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) మంజూరు చేయించారు. రాయితీ ఒప్పందంలోని క్లాజ్ 5.2 ప్రకారం 150 కిలోమీటర్ల ప్రత్యేకత పరిమితిని రద్దు చేసినట్లు నిర్ధారించారు. అయితే ఈ సడలింపు కేవలం మమునూరు విమానాశ్రయానికి మాత్రమే వర్తిస్తుంది. ప్రత్యేక జోన్‌లోని భవిష్యత్తు ప్రాజెక్టులపై ప్రభావం చూపదు. ప్రణాళిక దశను ప్రారంభించిన ఎయిర్ పోర్ట్ అథారిటీ.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ ఆదేశాల మేరకు అవసరమైన రెగ్యులేటరీ క్లియరెన్స్‌లను స్వీకరించిన అనంతరం కొనసాగడానికి గ్రీన్ సిగ్నల్‌తో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మౌలిక సదుపాయాల ప్రణాళికను ప్రారంభించింది. వరంగల్ విమానాశ్రయం కార్యాచరణ తెలంగాణ అభివృద్ధిలో కీలకంగా మారుతుందని, ప్రాంతీయ అభివృద్ధి, పర్యాటకం, వాణిజ్య అవకాశాలను పెంపొందించవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు భారత విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయడంలో తన అంకితభావాన్ని పునరుద్ఘాటించారు. ఈ విమానాశ్రయం కేవలం మౌలిక సదుపాయాల కంటే.. వరంగల్, పరిసర ప్రాంతాల అభివృద్ధికి మార్గం కానుంది. రామ్మోహన్ నాయుడు చురుకైన నాయకత్వం, రాష్ట్ర %-% కేంద్ర అధికారుల సమన్వయ ప్రయత్నాలతో, వరంగల్ విమానాశ్రయం భారతదేశ ప్రాంతీయ అనుసంధానంలో కీలకంగా మారనుంది. తెలంగాణకు ఉజ్వలమైన, మరింత అనుసంధానించబడిన భవిష్యత్తును వాగ్దానం చేస్తుంది.

## నా బ్యాగులు మోయవద్దు.. స్టేషన్‌కు రావొద్దు

అందించాలని నేతలకు సూచించారు. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేసారన్నారు. వారికి న్యాయం జరగాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే పదవులు పొందిన వారు ప్రజల కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. మనం చేసిన పనులను ప్రజలకు సైతం వివరించాలన్నారు.ఇక దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ కుల గణన చేపట్టామని వివరించారు. ఇది చాలా గొప్ప విషయమన్నారు. ప్రతి గ్రామ గ్రామానికి వెళ్లి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఈ సందర్భంగా పార్టీ నేతలకు ఆమె దిశానిర్దేశం చేశారు. గ్రామ గ్రామన పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ విషయంలో పీసీసీ పకడ్బందీగా అమలు చేసేలా ఓ కాలెండర్‌ను సిద్ధం చేయాల్సి ఉందన్నారు.ఫోన్ చేస్తే కార్యకర్తలతో సైతం తాను మాట్లాడతానని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. ఫ్లెక్సీ, ఫోటోలు పెడితే ఎన్నికల్లో నాయకులు గెలవరని.. ప్రజల్లో ఉంటేనే గెలుస్తారని తెలిపారు. మనం ఎలాంటి ప్రచారాలు లేకున్నా గతంలో స్వాతంత్ర్య పోరాటంలో గెలిచామని గుర్తు చేశారు. తన కోసం రైల్వే స్టేషన్లకు రావద్దంటూ పార్టీ నేతలకు ఈ సందర్భంగా సూచించారు.అలాగే తన బ్యాగులు సైతం ఎవరూ మోయవద్దన్నారు. అతనకు బలం లేకపోతే... మీ సహాయం అడుగుతానని ఈ సందర్భంగా పార్టీ నేతలకు తెలిపారు. మీ ఆత్మగౌరవాన్ని ఎక్కడ తక్కువ చేసుకోవద్దని.. మీ పని మీరు చేసుకోండంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు.

## నమస్తే హైదరాబాద్ వార్తకు స్పందించిన అధికారులు





### నమస్తే హైదరాబాద్ ఎఫెక్ట్

### స్తంభం లేకుండా పోస్ట్ ఆఫీస్ దారి

ఘట్కేసర్ ఫిబ్రవరి 28 (నమస్తే హైదరాబాద్)

మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపాలిటీ పోస్ట్ ఆఫీస్ దారిలో గాల్లో తేలుతున్న కరెంటు స్తంభంపై నమస్తే హైదరాబాద్ పేపర్లో ఫిబ్రవరి 26 న వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు, అక్కడ ఉన్న కరెంటు స్తంభాన్ని తీసివేసిన విద్యుత్ అధికారులు. ప్రజలు మాట్లాడుతూ ఈ కరెంటు స్తంభం వల్ల ఎన్నో ఇక్కట్లు ఏర్పడ్డాయి, ట్రాఫిక్ జామ్స్ చాలా అవుతుండే అని కరెంటు స్తంభం లేకపోవడంతో వాహనాలు మరియు పాదచారులు ఏ ఇబ్బందులు లేకుండా వెళ్తున్నారని, నమస్తే హైదరాబాద్ దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా 'విజ్ఞాన్ వైభవ్' జాతీయ సైన్స్ దినోత్సవం




నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : జాతీయ సైన్సే సందర్భంగా హైదరాబాద్లోని గచ్చిబౌలి స్టేడియంలో విజ్ఞాన్ వైభవ్ ప్రదర్శన జరుగుతుంది. ఈ ప్రదర్శనకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డీఆర్డీవో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విజ్ఞాన్ వైభవ్-2౩25 పేరిట గచ్చిబౌలి స్టేడియంలో రక్షణ రంగ ఉత్పత్తుల ప్రదర్శన చేస్తోంది. ఈ విజ్ఞాన్ వైభవ్-2౩25ను సీఎం రేవంత్‌రెడ్డి, రక్షణమంత్రి రాజ్‌నాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి , పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే గాంధీ, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ , శివ సేన రెడ్డి , పాల్గొన్నారు. 200 స్టాళ్లల్లో మూడు రోజుల పాటు ఈ ఎక్స్పో కొనసాగనుంది. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పరేడ్లో జీపుపై కేంద్రమంత్రి రాజ్నాథ్ సింగ్, సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. అక్కడ ఉన్న చిన్నారులకు అభివాదం చేశారు.ముందుగా సభా ప్రాంగణంలో శాస్త్ర రంగంలో దిగ్గజులైన దివంగత భారతరత్నాలు సీవీ రామన్, అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారని.. ఆయన గౌరవార్థం ఏటా ఈరోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని గుర్తు చేశారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టడంలో తెలంగాణ ప్రభుత్వం తన వంతు ప్రయత్నం చేస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ మేరకు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలన్నారు. దేశ రక్షణ రంగానికి ముఖ్య కేంద్రాలుగా ఉన్న హైదరాబాద్-బెంగళూరు నగరాల మధ్య డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ని కోరారు.తెలంగాణ రాష్ట్రం.. ప్రత్యేకించి హైదరాబాద్ నగరం కొన్ని దశాబ్దాలుగా దేశ రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న బీడీఎల్, డీఆర్‌డీఓ, మిథాని, హెచ్ఏఎల్ వంటి సంస్థలు దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తదితర ఉత్పత్తులను తయారు చేస్తున్నాయన్నారు.దేశ రక్షణ రంగానికి హైదరాబాద్‌తో పాటు బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయి. ఈ రెండు నగరాల మధ్య "హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్"ను ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గతంలోనూ కోరామన్నారు.హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్" ఏర్పాటు ద్వారా రక్షణ రంగంలో భారీగా పెట్టుబడులు వస్తాయి. స్కైరూట్ లాంటి స్టార్టప్, ప్రైవేటు సంస్థలు ఇప్పటికే రాకెట్లను తయారు చేస్తున్నాయి. కారిడార్ ప్రకటన రక్షణ రంగానికి మరింత ఊతం ఇచ్చినట్లు అవుతుందని అన్నారు.

## 'ప్రపంచంలోనే అత్యుత్తమ భాష సంస్కృతం'..

విజయం" అని ప్రధాని మోదీ అన్నారు. భారతదేశంలో సూఫీ సంప్రదాయం తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుందన్నారు ప్రధాని. సూఫీ సాధువులు మసీదులు, ఖంఖాలకే పరిమితం కాలేదు. వారు పవిత్ర ఖురాన్ అక్షరాలను చదివారు. వేదాల పదాలను కూడా విన్నారు. వారు అజాన్ శబ్దానికి భక్తి పాటల మాధుర్యాన్ని జోడించారని కొనియాడారు. ఏ దేశ నాగరికత, సంస్కృతి అయినా దాని పాటలు, సంగీతంలో తమ స్వరాన్ని బట్టి తెలుస్తాయన్నారు. అది కళ ద్వారా వ్యక్తమవుతుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు .

పపంచంలోనే అత్యుత్తమ భాష సంస్కృతం

ఈ సందర్భంగా ప్రపంచంలోని అన్ని పెద్ద దేశాల కంటే భారతదేశం గొప్పదని హజ్రత్ ఖుస్రో అన్నారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. సంస్కృతం ప్రపంచంలోనే అత్యుత్తమ భాష అని ఆయన అన్నారు. భారతదేశంలోని ఋషులు గొప్ప పండితుల కంటే కూడా గొప్పవారని ఆయన స్పష్టం చేశారు. హజ్రత్ అమీర్ ఖుస్రోకు ఎంతో ఇష్టమైన వసంతం ఢిల్లీ వాతావరణంలోనే కాదు, ఖుస్రో ప్రపంచ గాలిలో కూడా ఉంది. ఇక్కడి సమావేశానికి వచ్చే ముందు, తెహ్ బజార్‌ను సందర్శించే అవకాశం లభించింది అని ప్రధాని మోదీ అన్నారు.

## మార్చి 15 కల్లా బీజేపీకి కొత్త అధ్యక్షుడు..రేసులో ఎవరంటే?

పార్టీ చేపట్టినట్టు తెలుస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో జరగాల్సి ఉండటంతో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని చెబుతున్నారు. కాగా, పార్టీ జాతీయ అధ్యక్షుడి పేరును సూచించాల్సిందిగా ఆయా రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లను అధిష్ఠానం ఇప్పటికే కోరినట్టు తెలుస్తోంది. అయితే ఇటీవల కాలంలో బీజేపీ అనూహ్య నిర్ణయాలు తీసుకుంటున్నందున పార్టీ అధ్యక్ష పదవికి ఎవరికి దక్కుతుందనే విషయం చివరివరకూ ఉత్కంఠగా ఉండవచ్చని చెబుతున్నారు. కొత్త నాయకుడికి ఇటు పార్టీతోనూ, ఆర్ఎస్ఎస్‌తోనూ సత్సంబంధాలు ఉండటంతో పాటు కుల ప్రాతినిధ్యం, రీజనల్ డైనమిక్స్ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా 2019లో పగ్గాలు చేపట్టగా, 2020లో లాంఛనంగా ఎన్నికయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన పదవీకాలం 2024 జూలై వరకూ పొడిగించారు. నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుని ఆరోగ్యశాఖను అప్పగించినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల క్రమంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతూ వచ్చారు. పార్టీ రాజ్యాంగం ప్రకారం ఒకరికి ఒకే పదవి ఉండాలనే క్రమంలో కొత్త నాయకుడికి బాధ్యత అప్పగించేందుకు బీజేపీ అధిష్ఠానం తాజాగా కసరత్తు చేస్తోంది.

## రావూస్ స్కూల్ లో వైజ్ఞానిక ప్రదర్శన



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే మంచి వేదిక వైజ్ఞానిక ప్రదర్శన అని శేరిలింగంపల్లి రావూస్ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ పోల్సాని ప్రభాకర్ రావు పేర్కొన్నారు.శుక్రవారం పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ మేరకు ఒకటవ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి కి చెందిన విద్యార్థులు పలు అంశాలపై ప్రాజెక్టులను రూపొందించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆయన తిలకించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే మంచి వేదిక వైజ్ఞానిక ప్రదర్శన అని అన్నారు.ఏదైనా పాఠశాల స్థాయి నుంచే నేర్చుకోవాలన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనను చూసి ముచ్చట పడ్డారు.

## విద్యుత్ షాక్ తో సులుగూరి యాదమ్మ మృతి



దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్ ):విద్యుత్ షాక్ తో మహిళా మృతి చెందిన సంఘటన మండలంలోని కడవెండి గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై సృజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందినసులుగురియాదమ్మ(40)ఇంటి ఆవరణలోని నీటి సంపును కడుగుతూన్న క్రమంలో పక్కనే ఉన్న కరెంట్ తీగలు ప్రమాదవశాత్తు తగలడం వలన అక్కడిక్కడే మృతి చెందిందని తెలిపారు.మృతురాలికి ఇద్దరు కుమార్తెలు,కొడుకు,భర్త రవి ఉన్నారు.

## ఎదులాబాద్ రోడ్ లో చికెన్ మేళ నిర్వహించిన రామ్ రెడ్డి చికెన్ యాజమాన్యం




ఘట్కేసర్ ఫిబ్రవరి 28 (నమస్తే హైదరాబాద్)
మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఏదులాబాద్ రోడ్ లో రాంరెడ్డి చికెన్ యాజమాన్యం చికెన్ పకోడి అండ్ ఎగ్ మేళ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అబ్బాస్ ఆధ్వర్యంలో జ్ఞాన శేఖర్ ఏజీఎం, స్వామి తెలంగాణ మార్కెటింగ్ హెడ్, ప్రారంభించి ఘట్కేసర్ ప్రజలకు 200 గ్రాముల చికెన్ మరియు ఒక ఎగ్ ఇవ్వడం జరిగింది. అబ్బాస్ మాట్లాడుతూ 350 కిలోల చికెన్, 2000 గుడ్లు పంచడానికి పెట్టమని తెలిపారు. రామ్ రెడ్డి చికెన్ యాజమాన్యం మాట్లాడుతూ చికెన్ పై వస్తున్న అపోహలను నమ్మకండి అంటూ, వాటిపై అవగాహన కల్పించేందుకే ఈ చికెన్ ఫ్రై మేళ నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చైతన్య కుమార్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్) దేవరుప్పుల మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సైన్స్ యొక్క ఆవశ్యకత గురించి మాట్లాడుతూ, ఎందరో శాస్త్రజ్ఞులు కనిపెట్టినటువంటి పరికరాలు మరియు వాటి యొక్క ఉపయోగాల గురించి తెలియజేశారు, ఈ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడానికి ముఖ్య కారణం శాస్త్రవేత్త సి.వి రామన్ గారు రామన్ ఎఫెక్ట్ను కనిపెట్టినందున ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28 రోజున జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తోటకూరి కృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ తోటకూరి స్వప్న, మరియు సామాన్య శాస్త్ర బోధకులు రవీందర్ లావణ్య ఉమా శేషు మానస మరియు ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా నాయకులు

నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి ఫిబ్రవరి 28:
తుంగతుర్తి మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాడిచెట్టు పై నుండి పడి మృతి చెందిన చింతకుంట్ల యాకయ్య కుటుంబాన్ని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకుంట్ల యాకయ్య అనే గీత కార్మికుడు 09.02.2025 ఆదివారం నాడు సాయంత్రం 5 గంటలకు రోజువారీగా తాటి చెట్లు ఎక్కుటకు పోయి తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి జారీ కింద పడటంవల్ల అక్కడకక్కడే మృతి చెందడం జరిగినదని . జీవనోపాధి కొరకు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తూ ఈ పేదరిక కుటుంబాన్ని ఆదుకొని బీసీ కార్పొరేషన్ నుండి 25000 మరియు ఎక్స్ గ్రేషియా ప్రభుత్వము తక్షణ సహాయము 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల జనార్ధన్ సొసైటీ అధ్యక్షులు గుండాల రామస్వామి గ్రామ నాయకులు జోగునూరు దేవరాజ్ చింతకుంట్ల వెంకన్న మరియు వారి కుటుంబ సభ్యులు చింతకుంట్ల చింటు చింతకుంట్ల సోమయ్య బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



## గురునాథం చెరువు ను పరిశీలించిన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాధం చెరువు తరహా మిగతా చెరువుల పునరుద్ధరణ తో దశ దిశ మారనున్నాయని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు.శుక్రవారం ది లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథమ్ చెరువు,నాయనమ్మ కుంట, రామసముద్రం కుంట, పటేల్ చెరువు, పెద్దకుడి చెరువు, మిదికుంట చెరువుల సుందరికరణలో భాగంగా సుందరికరణ, పునరుద్ధరణ పనులను మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువు సుందరికరణ లో భాగంగా చెరువుల కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ,మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ యూజీడీ నిర్మాణం, అలుగు మరమ్మత్తులు,



చెరువు కట్ట బలోపేతం,పునరుద్దరణ పనులు, వాకింగ్ ట్రాక్, చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం, చెరువు యొక్క అలుగు నిర్మాణము వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లిగవాడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆనంద్ మల్లిగవాడ్, సభ్యులు రామ్,చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## బిక్షపతి ఎన్క్లేవ్ కాలనీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి : జనసేన మాధవరెడ్డి



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : బిక్షపతి ఎన్క్లేవ్ కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శేరిలింగంపల్లి జనసేన ఇంచార్జ్ డా. మాధవ రెడ్డి అన్నారు.శుక్రవారం చందానగర్ లోని బిక్షపతి ఎంక్లేవ్ కాలనీలో ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యలు, చెత్త, మంచినీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గత రెండు సంవత్సరాలుగా మంచినీటి పైపులైన్ లీకేజీ అవుతుందని, మూడు ప్రధాన చోట్ల పైప్ లైన్ పగిలిపోయి రోజుకు వేల లీటర్ల నీరు మురుగు నీటితో కలుస్తున్నాయని అన్నారు.ఇప్పటికే పలు మార్లు కాలనీ వాసులు జలమండలి అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు.ఈ సమస్య ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలి.అదేవిధంగా బ్రిడ్జి పై చెత్త,చెదారంతో దుర్వాసన, దోమల సమస్య అధికమౌతుందని అన్నారు.అంతేకాకుండా కుక్కల వల్ల రాత్రిళ్లు నడవడం కష్టం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన శేరిలింగంపల్లి ఇంచార్జ్ డాక్టర్ కొత్తపల్లి మాధవ రెడ్డి , చందానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వులిసి శ్రీనివాసరావు, చందానగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అడ్డాల ఏడుకొండలు, హాఫీజ్పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నిరంజన్,ఐటీ వింగ్ ప్రదీప్ చౌడిచెట్టి శ్రీనివాసరావు, యానాల సాయి కృష్ణారావు, పంతాల సాయిరంగా, జన సైనికులు , కాలనీవాసులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైన్స్ పై విజ్ఞానం పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలి

## బోయిని లింగయ్య మండల విద్యాశాఖ అధికారి

నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి ఫిబ్రవరి 28:
విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి సైన్స్ విజ్ఞానంపై మక్కువ పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బోయిన లింగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుండి ప్రయోగాత్మకంగా చదువును అలవర్చుకునే విధంగా ఒకరితో ఒకరు చర్చించుకోవాలని అన్నారు ప్రతి మనిషికి జ్ఞానంతో పాటు విజ్ఞానం కూడా చాలా అవసరమని అన్నారు సైన్స్ అనేది ప్రతిరోజు జీవితంలో ఒక భాగం అని అది మానవుడిని ఆధునిక మానవుడి స్థాయి వరకు తీసుకు వెళ్ళేది సైన్స్ అని అన్నారు రాయి తో రాయి రాపాడించి నిప్పును సృష్టించిన మానవుడి ఆలోచన నేడు అను బాబు తయారీ వరకు చేరిందంటే సైన్సు కారణమని అన్నారు. విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచేలా ప్రయోగాలతో విద్యాబోధన జరగాలని అన్నారు. ప్రయోగాల ద్వారా సైన్సును విద్యార్థులు బోధించడం వల్ల విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందని అన్నారు. దీనివల్ల విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ ఏర్పడి భవిష్యత్తులో భావి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి అవకాశం



ఉందన్నారు. సైన్స్ పట్ల అభిరుచి ఏర్పడితే విద్యార్థుల్లో మూఢనమ్మకాలు తొలగిపోయి శాస్త్రీయ దృక్పథం పెంపొందించిందని అన్నారు. విద్యార్థులు సైన్స్ డే సందర్భంగా చేసిన సైన్స్ ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి మల్లయ్య, డైరెక్టర్లు కోట వెంకట గోపాల్, నజీర్, సైన్స్ ఉపాధ్యాయులు ఉమా, లింగమూర్తి, అంబటి రమేష్, సురేష్, సరిత, రాధా, అనిత తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఎల్బీసీ టన్నెల్ పనుల్లో సింగరేణి రెస్క్యూ బృందాలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీశైలం ఎస్ఎల్బీసీ వద్ద కీలక రెస్క్యూ ఆపరేషన్లో సింగరేణి బృందాలు పాల్గొంటున్నాయి. శుక్రవారం సొరంగ మార్గంలో జరుగుతున్న రెస్క్యూ పనులను సీఎండీ ఎన్ బలరామ్ స్వయంగా పరిశీలించారు. ఎన్డీఆర్ఎఫ్ కల్నల్తో కలిసి సింగరేణి సీఎండీ 14 కిలోమీటర్ల సొరంగ మార్గంలో ప్రమాద స్థలి చేరువ వరకు పరిస్థితిని సహాయక చర్యలను పరిశీలించారు. సింగరేణి రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో జరుగుతున్న గ్యాస్ కటింగ్ పనులను సీఎండీ పర్యవేక్షించారు. ట్రాక్ పునరుద్ధరణ జరగాలంటే దానిపై కూలిన టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) భాగాలను తొలగించాల్సి ఉంటుంది. ఈపనిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది తమ వద్ద గల అత్యాధునిక గ్యాస్ కటింగ్ యంత్రాల ద్వారా ఇనుప పైపులను, గడ్డర్లను కత్తిరిస్తూ వేరుచేస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకోవడం కోసం ఈ ట్రాక్ పునరుద్ధరణ అత్యవసరం కావడంతో దీనిపై సింగరేణి రెస్క్యూ బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. అదే సమయం లో ట్రాక్ మీద పేరుకుని ఉన్న బురద మట్టిని కూడా రెస్క్యూ బృందాలు తొలగిస్తున్నాయి. మొత్తం 250మంది సింగరేణి రెస్క్యూ సభ్యులు 24గంటలు ఈ పనిలో పాల్గొనేందుకు వీరిని నాలుగు షిఫ్టులుగా కేటాయించారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ సమర్థంగా పనులు పూర్తిచేయాలని సీఎండీ రెస్క్యూ సిబ్బందికి సూచించారు.

# మహిళా జర్నలిస్ట్ కు రూ ..14,000 ఆర్థిక సహాయం...



## తోటి విలేకరుల చేయూత

## ఐక్యతను చాటుకున్న కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేత

కాప్రా,ఫిబ్రవరి 28 (నమస్తే హైదరాబాద్): సహచర మహిళా జర్నలిస్ట్ మమత తండ్రి కన్నయ్య ఇస్తారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. తోటి విలేకరులు వారికి తోచిన మేరకు మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులు మమత ను మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీ రాజీవ్ నగర్ లో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ విలేకరులతో కలసి పరామర్శించి రూ..14 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులలో ఒక్కరికి కష్టం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరు ఐక్యతగా ముందుకు వెళ్లడం ఒకరికొకరు సాయం చేసుకోవడం అభినందనీయమన్నారు.

ఆర్థిక సహాయం అందజేతలో కాప్రా ప్రెస్ క్లబ్బులకు సంబందించిన సభ్యులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం లో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పటేల్ నర్సింహులు యాదవ్,దొమ్మటి కిరణ్ కుమార్, గుమ్మడి రోజరాణి, బెల్దే అశోక్, ఏంపల్లి పద్మారెడ్డి, వెంకట్,రామచంద్రమూర్తి,గంగి కృష్ణ,ముత్యం ముకేశ్ గౌడ్,జి.శ్రీనివాస్ రావు,గుమ్మడి హరిప్రసాద్,నిరంత్ గౌడ్,కిర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీ చికెన్ మేళా.. ఎగబడిన జనం

## పది నిమిషాల్లోనే 250 కిలోల చికెన్ ఫ్రై, 25 వందల బాయిల్డ్ ఎగ్స్ ఖతం

## మేళా లో పాల్గొన్న పట్టణ ప్రముఖులు






నమస్తే హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ భయం కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీంతో చికెన్, గుడ్లు కొనేవారు కరువై. మార్కెట్లు వెలవెల బోతున్నాయి. ఈ క్రమంలో జనాల్లో బర్డ్ ఫ్లూ భయాన్ని పోగొట్టేందుకు వెంకాబ్ వారి సహకారంతో బాబా చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో చికెన్ వ్యాపారులు కలిసి భువనగిరి పట్టణంలో పాత బస్టాండ్ లో చికెన్ సెంటర్ల యజమానులు ఫ్రీ చికెన్ మేళా నిర్వహించారు. జనాలకు చికెన్ ఫ్రై,ఉడికించిన గుడ్లను ఉచితంగా పంచారు. దీంతో జనాలు ఒక్కసారిగా ఎగబడ్డారు. దాదాపు 250కిలోల చికెన్ ఫ్రై, 25వందల బాయిల్డ్ ఎగ్స్ కేవలం 10 నిముషాల్లోనే అయి పోయాయి. అనంతరం పట్టణ ప్రముఖులు చికెన్ సెంటర్ యజమానులు మాట్లాడుతూ చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినడం వలన బర్డ్ ఫ్లూరాదని, జనాలు భయపడాల్సిన పనిలేదని అహగాహన కల్పించారు. వారి ప్రయత్నాన్ని అధికారులు సైతం అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థల చైర్మన్ అవేస్ చిస్తి , కాంగ్రెస్ జిల్లా యూత్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కుక్కదువు సోమయ్య , తంగేళ్లపల్లి రవికుమార్ , మాజీ కౌన్సిలర్ లు సలావుద్దీన్, కిరణ్ , శంకర్,జిల్లా మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మైనారిటీ నాయకులు మొహమ్మద్ ఇలియాజ్, వెంకాబ్ చికెన్ మార్కెట్ మేనేజర్ జయపాల్ రెడ్డి, దేవేందర్,షేక్ జహంగీర్, అబ్దుల్ మన్నన్, గౌస్, షానూర్, సాహెబ్, సమద్, సుజావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వినటంతో ఏకాగ్రతతో పాటు నాలెడ్జ్ బిల్డ్ అవుతుంది

## ఉమెన్ పోలీస్ స్టేషన్ సిఐ




నమస్తే హైదరాబాద్ : విద్యార్థులకు చదువుతో వికారాబాద్ పట్టణ కేంద్రంలోని సెయింట్ జూడ్స్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై సాంఘిక బాధ్యత కలిగుండేలా తయారుచేయాలని తెలిపారు. ప్రస్తుత తరుణంలో పిల్లలకు ప్రతి విషయం టీవీ ఫోన్లు ఐపాడ్లు ఇచ్చి నేర్పించడంతో పిల్లలకు ఏకాగ్రత లోపిస్తుందని అన్నారు. ప్రతి విషయము తెలుసుకోవాలన్న సాంఘిక మాధ్యమాలపై ఆధారపడవలసి వస్తుందని గుర్తుంచుకునే కెపాసిటీ తగ్గుతుంది అన్నారు. పిల్లలకు ఓపికగా ప్రతి విషయాన్ని వినడం నేర్పించాలని దీంతో ఏకాగ్రత పెరిగి ప్రతి విషయంపై నాలెడ్జ్ నిర్మాణం అవుతుందని అన్నారు. మహాభారత రచనలో వ్యాస మహర్షి చెప్పిన విషయాన్ని సరైన రీతిలో వినటంతో వినాయకుడు అంత పొద్దికగా మహాభారత రచన చేశాడని అన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు ఉదయం సరైన సమయానికి లేపే అలవాటు నేర్పాలని దాంతోనే సరైన క్రమశిక్షణ అలవాటు పడుతుందని అన్నారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించడం కూడా మంచి ఆరోగ్యానికి ఏకాగ్రతకు సహకరిస్తుందని దాంతో మెరుగైన విద్యార్థులను తయారు చేయవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ప్రధాన ఉపాధ్యాయురాలు ఉషారాణి మాట్లాడారు. వార్షికోత్సవంలో ప్రతి తరగతిలోని విద్యార్థినీ విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీలు సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ కాల్వ ద్వారా చివరి ఆయకట్ట వరకు నీటిని అందించాలి

## బిజెపి జిల్లా నాయకులు దేశగాని నరసయ్య

- మండుతున్న ఎండలు ఎండుతున్న పంటలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పశువులను మేపుతున్న రైతులు
- ఆందోళనలో అన్నదాతలు

నాగారం, నమస్తే హైదరాబాద్ :(ఫిబ్రవరి 28) ఎస్సారెస్పీ కాలువ ద్వారా చివర ఆయకట్టు వరకు నీళ్లు అందించాలని బిజెపి పార్టీ జిల్లా నాయకులు దేశగాని నర్సయ్య అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పూర్తిగా ఎండాకాలం రాక ముందే ఎండలు మండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లల్లో నీరు రాక వరి పొలాలు ఎండి పోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ ఆర్ ఎస్ పి కాలువ ద్వారా నీటిని వదిలినప్పటికీ చివరి ఆయకట్ట వరకు నీళ్లు అందకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న రైతుల యొక్క వరిపొలాలు ఎండి బీటలుబారుతున్నాయి. ఆరుగాలం శ్రమపడి సాగు చేసిన రైతుల పొలాలు పొట్టకు వచ్చే దశలో నీళ్లు అందకపోవడంతో రైతులు అవస్థ పడుతున్నారని అన్నారు. కొద్దిరోజుల్లో చేతికి రానున్న పొలాలు బీటలుబారడంతో ఎన్నో ఆశలతో సేద్యం చేస్తున్న అన్నదాతలలో ఆందోళన నెలకొంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారంబంది పద్ధతిలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని అందిస్తామని చెప్పడంతో నీళ్లు వస్తాయని ఆశతో బోర్లు బావులలో నీరు లేకపోయినా లక్ష్మాపురం, కాశి తండా, శాంతినగర్ పరిసర ప్రాంతాలలో ఎస్సారెస్పీ కాలువకు ఆనుకుని ఉన్న ఎంతో మంది రైతుల ఆశల చిగురించి వరినాట్లు వేశారు. కానీ పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండి పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు వాపోతున్నారు. పొలాలు ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారని అన్నారు. లక్ష్మాపురం గ్రామంలో చెరువు ఎండిపోయిందని కనీసం చెరువు నిండేంతవరకైనా నీరు వస్తే ఆ చెరువు కింద ఉన్న బోర్లు పోస్థాయని చెరువు నిండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు . కాల్వ మధ్య మధ్యలో పెద్ద పెద్ద రాల్లు వేసి చివరి ఆయకట్ట వరకు నీళ్లు రాకుండా పైన ఉన్న రైతులు అడ్డుకుంటున్నారని దీనిపై అధికారులు స్పందించి ఎస్సారెస్పీ కాలువ ద్వారా పూర్తిస్థాయిలో చివరి ఆయకట్ట వరకు నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు . ఈ కార్యక్రమంలో శాగంటి పెద్ద అంజయ్య, శాగంటి వెంకన్న, పొదిల రామ్మూర్తి, తూర్పటి పెద్ద లింగయ్య, శాగంటి అంజయ్య, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.





Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..

NH paper 01-03-25 (4).pmd 4 3/1/2025, 6:45 AM